# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్ట్ 15 నుంచి మహిళలకు బస్సుల్లో జీరో ఫేర్ టికెట్ ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **తెలంగాణలో ఈనెల 25 నుంచి వచ్చే నెల 10 వ తేదీ వరకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
3. **మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి అన్నారు.**
4. **ధూప దీప నైవేద్య పథకం ద్వారా అర్చకులకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**
5. **ప్రముఖ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్యులు 100వ జయంతి ఈరోజు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్ట్ 15 నుంచి మహిళలకు బస్సుల్లో రుసుము లేని జీరో ఫేర్ టికెట్ ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత ప్రయాణంతో లబ్ది, 100 శాతం రాయితీ వివరాలను మహిళలకు ఇచ్చే టికెట్‌లో పొందుపర్చాలన్నారు. ఈ పథకం నిర్వహణకు ఆర్టీసీకి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు అన్వేషించాలని సూచించారు. రాష్ట్రంలో ఇకపై ఏసీ విద్యుత్ బస్సులే కొనుగోలు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

--------------------------

తెలంగాణలో ఈనెల 25 నుంచి వచ్చే నెల 10 వ తేదీ వరకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. వర్షాలు, వానాకాలం పంటసాగు, రేషన్‌కార్డుల పంపిణీ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లతో దృశ్య మాధ్యమం ద్వారా హైదరాబాద్ నుంచి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అన్ని మండల కేంద్రాల్లో రేషన్‌కార్డుల పంపిణీ జరగాలని సూచించారు. కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని ఆందోళన అవసరం లేదని అన్నారు. రాష్ట్రంలో సరిపడినంత ఎరువులు ఉన్నాయని, దుకాణాల్లో ఎరువుల నిల్వ సమాచారాన్ని తెలిపే సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి అన్నారు. తిరుపతి జిల్లా గూడూరులోని పంబలేరు వంతెనను మంత్రి గత సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వంతెన పూర్తి చేయడానికి తొమ్మిది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ వంతెన ద్వారా జాతీయ రహదారి మీదుగా గూడూరు పట్టణం వెళ్లడానికి వీలుగా ఉంటుందని, ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గే అవకాశం ఉందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..25 సెకన్లు

-----------------------------

ధూప దీప నైవేద్య పథకం ద్వారా ఆలయాల్లో సేవలు నిర్వహిస్తున్న అర్చకులకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ పథకం కింద తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని 5 దేవాలయాలు ఎంపికయ్యాయని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ధూప, దీప, నైవేద్యాలు నిర్వహణకు ప్రతి నెలా అర్చకుడి ఖాతాలో ప్రభుత్వం 10వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తుందని అన్నారు. తద్వారా ప్రతి రోజూ ఆయా దేవాలయాల్లో నిత్య కైంకర్యాలు అమలు అవుతాయని మంత్రి పేర్కొన్నారు.

-----------------------------

తెలంగాణలో కులగణనకు అవలభించిన విధానాలను దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వివరించనున్నారని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి తెలిపారు. ఢిల్లీలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈనెల 24న ముఖ్యమంత్రి ఢిల్లీలో పర్యటించి కులగణనపై నిపుణుల కమిటీ నివేదికను కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు అందజేయనున్నారని చెప్పారు. కులగణన, బీసీ రిజర్వేషన్లపై ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ ఎంపీలకు ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తారని మల్లు రవి తెలుపుతూ,

వాయిస్..30 సెకన్లు

-----------------------------

రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం బోనకల్లులో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆహార భద్రత విషయంలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. పేదలతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన మధ్యతరగతి వర్గాలకు రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని తెలిపారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం పరిశుభ్రతకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని మహా విశాఖ నగర పాలక సంస్థ – జీవీఎంసీ మేయర్ పి. శ్రీనివాసరావు తెలిపారు. విశాఖపట్నంలో నిన్న ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో సఫాయి సురక్ష షహర్ విభాగంలో జీవీఎంసీ మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయిలో అవార్డు అందుకుందని తెలిపారు. ఈ స్ఫూర్తితో నగరంలో మరిన్ని పరిశుభ్రత చర్యలు చేపట్టనున్నామని మేయర్ తెలుపుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ప్రముఖ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్యులు 100వ జయంతి ఈ రోజు, తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలనపై ఎక్కుపెట్టిన ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్యులు, నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించారు. నిజాంకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచేందుకు ఎన్నో పాటలు రాశారు. 1925 జూలై 22న మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిన్నగూడూరులో జన్మించిన ఆయన... ఉపాధ్యాయుడిగా, ఆకాశవాణి ప్రయోక్తగా సేవలందించారు. పలు తెలుగు చలన చిత్రాలకు గేయాలు, అనేక కథలు, నాటికలు రచించిన దాశరథి 1987 నవంబర్ 5న తుదిశ్వాస విడిచారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

తిరుమలలో గత రాత్రి పల్లవోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి ఈ కార్యక్రమాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తోంది. సహస్ర దీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేశారు. అనంతరం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థాన ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పించారు.

---------------------------

ప్రభుత్వ వసతి గృహాలలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలా వీరాంజనేయ స్వామి అన్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ వసతి గృహాలపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వసతి గృహాల మరమ్మతులకు 9 కోట్ల 30 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశామని చెప్పారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతం దాని ఆనుకొని ఉన్న కోస్తాంధ్రప్రదేశ్ మీదుగా ఉపరితల ఆవర్తనం నెలకొని ఉందని అమరావతి భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..20 సెకన్లు

మరోవైపు తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

====================